



పూడూరు మండలం కంకల్ పాఠశాలలో అధ్వాన స్థితిలో మరుగుదొడ్లు



మొక్కలు నాటి నీరు పోస్తున్న పురపాలక కమిషనర్ శ్రీదేవి

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

» పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవి

కొడంగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ టి.కే.శ్రీదేవి అన్నారు. మంగళవారం కొడంగల్ మున్సిపాలిటీలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన, వైద్య శిబిరాల ఏర్పాటు, మురుగు కాల్వల్లో పూడికతీత తదితర అంశాలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి కడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుభకార్యాల్లో ప్లాస్టిక్‌ను వాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలను ప్రోత్సహించి వారితో టెంట్‌హౌస్‌లను ఏర్పాటు చేయించాలన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. కొడంగల్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎంఏయూడీ జాయింట్ డైరెక్టర్ పల్లవ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బల్‌రామ్‌నాయక్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి

వృద్ధురాలి మృతి.. కొడుకు రాజేందర్‌కు తీవ్ర గాయాలు
రాజేందర్ భార్య తరపు వారిపైనే అనుమానాలు
పరిగి మండలం రాపోలు గ్రామంలో ఘటన

6

అన్ని వర్గాల సంక్షేమానికే పోరాటం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ
జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

7


దాదాపు 55 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత రేపు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. బడిగంట మోగేందుకు వేళైనా.. పలు పాఠశాలలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. కొత్త విద్యా సంవత్సరం కూడా పాత సమస్యలతోనే ప్రారంభం కాబోతోంది. పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో మార్పు కనిపించని పరిస్థితి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల తీరుపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన విజిట్‌లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.



పెద్దేముల్ మండల ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదుల పైకప్పు

సమస్యల స్వాగతం

సవాళ్ల మధ్య రేపు బడులు పునఃప్రారంభం



అధ్వానంగా మరుగుదొడ్లు.. మూత్రశాలలు
నల్లా కనెక్షన్లు లేక నిరుపయోగంగా ట్యాంకులు
పలుచోట్ల పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు
ప్రహరీ లేక కుక్కలకు ఆవాసంగా తరగతి గదులు
అసంపూర్తి భవనాలు.. పూర్తి కాని పనులు
చాలాచోట్ల శిథిలావస్థలో పాఠశాల భవనాలు
రేపటి నుంచి మోగనున్న బడిగంట
ఆంధ్రజ్యోతి విజిట్‌లో వెలుగులోకి సమస్యలు

జిల్లాల వారీగా స్కూళ్ల వివరాలు

	మేడ్చల్	వికారాబాద్
ప్రాథమిక	375	776
ప్రాథమికోన్నత	22	111
ఉన్నత	108	175
ఎయిడెడ్	10	--
మొత్తం	515	1,062

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 10): ఎప్పటి మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో సహవాసం చేస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలు.. చాలీచాలని గదులు.. మరుగుదొడ్లు, మూత్రశాలలు.. అసంపూర్తి నిర్మాణాలతో పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయి. చాలీచాలని సౌకర్యాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నేటికీ అనేక

మిగతా 8వ పేజీలో...



మోమిన్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పిచ్చి మొక్కలు

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు

తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండల పరిధిలోని సంగెం ఖుర్దు గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలలో ఐదో తరగతి వరకు కొనసాగుతోంది. ఈ పాఠశాలలో మొత్తం 52మంది విద్యార్థులు ఉన్నారు. కాగా, ఇక్కడ శిథిలావస్థకు చేరిన ఒక భవనం, మరో రెండు గదులు మాత్రమే ఉన్నాయి. పాఠశాలకు అదనంగా తరగతి గదుల అవసరం ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిష్టాపూర్, గంగసాగర్, రేండ్లగడ్డ తండా, తదితర గ్రామాల్లో పాఠశాల భవనాలు వర్షాల కారణంగా లీకేజీ అవుతున్నాయి. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రెండు తరగతి గదులు పైకప్పులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ ఐదో తరగతి వరకు విద్యా బోధన జరుగుతోంది. ప్రస్తుతం ఆరు గదులు ఉన్నప్పటికి నాలుగు గదులు మాత్రమే విద్యార్థులకు బోధించేందుకు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 20 పాఠశాలల వరకు పైకప్పు పెచ్చులు ఊడుతున్న స్థితిలో ఉన్నాయి. చాలా చోట్ల మరుగుదొడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి.



శామీర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెత్తాచెదారం

మేడ్చల్ జిల్లాలోనూ అసంపూర్తిగానే..

మేడ్చల్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలతోనే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా మన ఊరు మన బడి కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని పాఠశాలల్లో అసలు పనులు ప్రారంభమే కాలేదు. మరికొన్ని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పలు పాఠశాలల్లో అసంపూర్తిగా వదిలివేశారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులు చేయకపోవడం, తరగతి గదులు పై పెచ్చులు ఊడి పోవడం, వాటర్ ఫిల్టర్‌లను శుభ్రం చేయకపోవడం, చెత్తాచెదార పేరుకుపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి.

కస్తూర్బాలో కొత్త రుచులు

వారానికి రెండుసార్లు చికెన్, ఐదుసార్లు గుడ్డు అల్లం ఛాయ్, మిల్లెట్ బిస్కెట్లు స్కూళ్ల ఆరంభం నుంచే కొత్త మెనూ అమలు వంట మనుషులకు పూర్తయిన శిక్షణ

బాలికల పోషకాహారంపై సర్కార్ ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ)చదివే బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు సర్కార్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా విద్యాలయాలను దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వీటి నిర్వాహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అయితే ఇటీవల కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో చదివే బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బాలికలు పౌష్టికాహార లోపంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు చదువుతోపాటు పోషకాహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురుకుల విద్యాలయాల్లో మాదిరిగానే కేజీబీవీల్లో కూడా మెస్‌చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార పట్టికలో మార్పులు చేసింది.

పెరిగిన మెస్ చార్జీలు

గతంలో కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీల కింద రూ.1,225లు అందించే వారు. ఇప్పుడు దీన్ని రూ.1,740కి పెంచారు. అంటే గతంలో కంటే రూ.515 మెస్‌చార్జీలు పెంచారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే రోజు అంటే.. గురువారం నుంచే కొత్త మెనూ అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచే కొత్త వంటలు రూచి చూడనున్నారు. కొత్త మెనూ ప్రకారం నెలలో రెండు సార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గుడ్లు, ప్రతి రోజూ నెయ్యి వడ్డిస్తారు. కొత్త ఆహార పట్టికను రూపొందించిన ప్రభుత్వం దీన్ని అమలు చేసే బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో

మిగతా 7వ పేజీలో...



మారిన మెనూ ఇదే..

ఉదయం: ఉప్మా, జీరా రైస్, పులిహోర, టమాట కిచిడి, రాగి జావ, సాంబారు, బూస్టు, పూరి, బోండా, వడ, చపాతి, అరటి పండు
మధ్యాహ్నం : టమాట పప్పుతో అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్
సాయంత్రం : పకోడి, ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లంపట్టీలు, అల్లం ఛాయ్, మిల్లెట్ బిస్కెట్లు
రాత్రి వేళ : వివిధ రకాల కూరలతో అన్నం, మజ్జిగ, సాంబారు



రెవెన్యూ సదస్సులో అర్జీదారులతో మాట్లాడుతున్నకలెక్టర్ ప్రతీక్‌జైన్

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కొడంగల్ మండల పరిధిలోని రావులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రశీదులు అందిస్తూ సంబంధిత రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఒకవేళ సమస్యలను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం



వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలైన హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో 2025- 26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారి సత్తార్ పేర్కొన్నారు. మొత్తం 120 సీట్లకు ఎంపిక ఉంటుందని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్ వంటి ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 30, 2017 మధ్య జన్మించిన 8-9 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 7 నుంచి ప్రారంభమైందన్నారు. పూర్తి వివరాలకు 9676638201 నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



వైభవంగా ఎల్లమ్మ జాతర



అమ్మవారికి వేపచీరతో మొక్కు తీర్చుకుంటున్న భక్తురాలు

తాండూరు రూరల్, జూన్10(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర వైభవంగా కొనసాగుతోంది. చివరి మంగళవారం సందర్భంగా కర్ణాటక ప్రాంతం నుంచి తెల్లవారు జామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు గండజ్యోతి మోస్తూ అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. ప్రధాన ఘట్టాలైన సిడే, రథోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కాగా, నేటి(బుధవారం) పౌర్ణమితో ఉత్సవాలు ముగియనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుకుండా ఆలయ ప్రాంగణంలో 16 సీసీ కెమెరాలు, కొత్లాపూర్ గ్రామంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో శేఖర్ గౌడ్‌తోపాటు మాజీ సర్పంచ్ బుడ్డెళ్లి సాయిలు, ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బైండ్ల రాజు, లాలయ్య గౌడ్, లల్లానాయక్, శాంతప్ప, చెవిటి లక్ష్మీ, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీలో ధారాసింగ్‌కు మరోసారి చోటు



పెద్దేముల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కొత్త కార్యవర్గంలో పెద్దేముల్ మండలం మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్‌కు మరోసారి చోటు లభించింది. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ధారాసింగ్‌ను మరోసారి ఆ పదవిలో కొనసాగే అవకాశాన్ని అధిష్ఠానం కల్పించింది. పార్టీలో సీనియర్ నాయకులైన ధారాసింగ్ గతంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా , పెద్దేముల్ జెడ్పీటీసీ, ఎంపీపీ, సింగిల్ విండో చైర్మన్ , డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పని చేశారు. మొదటి నుంచి పార్టీలోనే క్రమశిక్షణ గల కార్యకర్తగా కొనసాగుతుండటంతో టీపీసీసీ కార్యవర్గంలో ఆయనకు చోటు కల్పిస్తూ ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.



స్పీకర్‌ను కలిసిన నూతన మంత్రి శ్రీహరి

వికారాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను రాష్ట్ర నూతన మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్పీకర్ నివాసానికి మంత్రి కుటుంబసమేతంగా వచ్చి పుష్పగుచ్ఛం అందజేశారు.



మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

హామీలను నెరవేర్చాలి : జంగయ్య

చేవెళ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బడాబాబుల ఆదాయం రెట్టింపు చేసేందుకు కేంద్రం పని చేస్తుందని ఆరోపించారు. మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రజల ఖాతాల్లో 11 రూపాయలు కూడా జమ చేయలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సుభాన్‌రెడ్డి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బూల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణచారి, మండల మహిళా అధ్యక్షురాలు మంజుల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి

● వృద్ధురాలి మృతి, కొడుకు రాజేందర్‌కు తీవ్రగాయాలు

పరిగి, జూన్10(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తుల విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటనలో వృద్ధురాలు మృతి చెందగా, ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాపోల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. పరిగి మండలం రాపోల్ గ్రామానికి చెందిన గండు రాజేందర్(40) వృత్తి రీత్యా ప్రభుత్వ టీచర్. రాజేందర్ అదే గ్రామానికి చెందిన సంగీతతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఓ కొడుకు, కుతూరు. రాజేందర్ మద్యానికి బానిసై భార్యను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. భర్త వేధింపులు భరించలేక సంగీత తన పిల్లలతో కలిసి పరిగిలోని తల్లిగారి ఇంట్లో ఉంటోంది. రాజేందర్ తల్లి నర్సమ్మతో కలిసి రాపోల్‌లో ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి తర్వాత నలుగురు గుర్తు తెలియని యువకులు తాగిన మత్తులో రాజేందర్ ఇంటికి వచ్చి దాడి చేశారు. నా కొడుకును కొట్టకండి అంటూ తల్లి నర్సమ్మ(60), అడ్డుకోబోయింది. దుండగులు రాజేందర్‌తోపాటు, తల్లి నర్సమ్మపై విచక్షణరహితంగా దాడి చేశారు. దీంతో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రాజేందర్‌కు తీవ్ర గాయాలు కాగా పరిగి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. రాజేందర్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడికి పాల్పడిన యువకులు గ్రామస్తులుగా గుర్తించినట్లు తెలిసింది. ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా దాడికి జరిగిన కారణాలకు ఆధారాలు సేకరించామని సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

రాజేందర్ భార్య బంధువులపైనే అనుమానాలు?

రాజేందర్, తల్లి నర్సమ్మలపై దాడి చేసిన వ్యక్తులు రాజేందర్ భార్య తరఫునకు చెందిన వ్యక్తులుగానే అనుమానిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని పోలీసులు ప్రాథమిక గుర్తించారు. వారిని అదుపులోకి కూడా తీసుకున్నట్లు తెలిసింది. ముందు రాత్రి రాజేందర్ భార్య తరపు బంధువులు పథకం పన్నారనే అనుమానిస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు మద్యం, గంజాయి సేవించినట్లు సమాచారం.రాజేందర్ ఒక్కడిపైనే దాడి చేయాలని భావించినట్లు తెలిసింది. భార్యకు రాజేందర్ దూరం కావడం వల్లనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లును అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఫార్మసీ రంగంలో పరిశోధనలు గర్వకారణం



సంగుకు పట్టా అందజేస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఫార్మసీలో పరిశోధనలు దేశానికిఎంతో అవసరంతో పాటు గర్వకారణమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. హిమాయత్ నగర్‌లోని వర్సిటీలో ఫార్మసీ విభాగంలో వినీల సంగు 'ఫార్ములేషన్ అండ్‌ఎవాల్యుయేషన్ ఆఫ్ గ్యాస్ట్రోరేటేటివ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఫర్ సమ్ డ్రగ్స్' అంశంపై ప్రొ.పిశంకరయ్య పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దాంతో ఆమెకు పీహెచ్‌డీ పట్టాను సాత్వికరెడ్డి ప్రదానం చేశారు. డీన్ ఆచార్య క్రిస్టోఫర్, రాజేందర్‌రెడ్డి, జగదీశ్‌కుమార్, కుమారస్వామి, లలిత, డానియేల్, సరిత, సృజన, రాంబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్

● మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారికి భూ భారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని, రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలకు చెక్ పెట్టొచ్చని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులతో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా అనేక మంది పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. నేడు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు దరఖాస్తులను స్వీకరించి అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

త్వరలో మహేశ్వరం కాంగ్రెస్‌లో పదవుల భర్తీ

త్వరలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ పదవులన్నీ భర్తీ చేయనున్నామని, అందుకోసం ఆశావహులు నేడు(బుధవారం)తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు నిర్వహిస్తున్న బ్లాకుల వారి సమావేశాలను వినియోగించుకోవాలన్నారు. ఈమేరకు మంగళవారం తుక్కుగూడ లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గాన్ని పార్టీపరంగా రెండు బ్లాకులుగా విభజించామని కందుకూరు, మహేశ్వరం మండలాలతో పాటు జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలను కలుపుకొని మొదటి బ్లాకు, జీహెచ్‌ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లు, బడంగ్‌పేట్, మీర్‌పేట కార్పొరేషన్లను కలుపుకొని రెండవ బ్లాకుగా విభజించామన్నారు. ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి కృషి చేసేవారు బ్లాక్, డివిజన్, మండల, గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ఇతరత్రా పదవులను ఆశించే నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాన్ని నాలుగు బ్లాకులుగా విభజించిన విషయాన్ని గమనించాలన్నారు. నేడు ఉదయం 9 గంటలకు తుక్కుగూడలో బ్లాక్ కాంగ్రెస్-1 సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు బ్లాక్ కాంగ్రెస్-2 సమావేశం సరూర్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్‌హాలులో సమావేశం ఉంటుందన్నారు. పరిశీలకులుగా శివసేనారెడ్డి, ధారాసింగ్‌లు వస్తున్నారన్నారు. పార్టీ ఆదేశాలను కాదని పైరవీలతో ఎవరు ముందుకెళ్లినా ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు.

యాచారం సొసైటీలో పేరుకుపోయిన బకాయిలు

● చెల్లించాలని రైతులకు డీసీసీబీ అధికారుల సూచన



గున్‌గల్‌లో రైతును బకాయిలు చెల్లించాలని కోరుతున్న అధికారులు

యాచారం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల సొసైటీలో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ఈమేరకు వసూళ్లకు డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్‌రావు, అధికారి డీఎల్ఎన్ రెడ్డి, యాచారం బ్యాంక్ మేనేజర్ నాగలక్ష్మి, సొసైటీ సీఈవో నాగరాజులు మంగళవారం గున్‌గల్, చౌదర్‌పల్లి, నందివనపర్తి, మాల్ తదితర గ్రామాలలో రైతుల ఇంటి వద్దకెళ్లి బాకీ చెల్లించాలని కోరారు. మండలంలోని పలు గ్రామాలలో పౌల్ట్రీఫాంల నిర్వాహకుల నుంచి రూ.15కోట్ల బకాయిలున్నట్లు సీఈవో నాగరాజు వెల్లడించారు. మండలంలో 726 మంది నుంచి రూ.15కోట్ల బకాయిలున్నట్లు చెప్పారు. కాగా, బకాయిలు చెల్లించాలని 326 మందికి లీగల్ నోటీసులు ఇచ్చామన్నారు. బకాయిలు చెల్లించి ఖరీఫ్‌లో తోటి రైతులకు రుణాలివ్వడానికి రైతులు సహకరించాలని డీసీసీబీ అధికారులు రైతులను కోరారు.

శ్రీహరికి మంత్రి పదవిపై హర్షం



తలకొండపల్లి : సంబురాల్లో ముదిరాజ్ సంఘం నాయకులు



కడ్తాల : రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గీతానర్సింహ

కడ్తాల్/తలకొండపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మక్తల్ ఎమ్మెల్యే ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో స్థానం కల్పించడాన్ని హర్షిస్తూ మండలకేంద్రంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ హాజరైసీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాల్‌రాజ్, యాదయ్య, చెన్నయ్య, రాఘవేందర్, నర్సింహ, జంగయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, అంజయ్య, కృష్ణ, పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లిలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు బోళ్ల యాదగిరి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య, సురేశ్, మల్లేశ్, ఆంజనేయులు, నర్సింహ, మైసయ్య, సత్తయ్య, నరేశ్, శంకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

కేశంపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు నుంచి బీదర్ వరకు వేస్తున్న 765 కేవీఏ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈమేరకు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంటుకోట మహేష్, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు పసుల నరసింహ యాదవ్, పోమాల్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుర్రి భూపాల్‌రెడ్డిలు మంగళవారం కేంద్ర సహాయ మంత్రిని గోవాలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. గ్రామానికి అతి సమీపం నుంచి విద్యుత్ లైన్ వేస్తున్నారని, దానిని మార్చాలిన కోరినట్లు పేర్కొన్నారు. కోళ్లఫామ్ ఉన్నచోట అలైన్‌మెంట్ మార్చిన అధికారులు.. గ్రామ సమీపంలో మార్చడానికి ససేమిరా అంటున్నారని వినతిపత్రంలో కోరారు. గ్రామ సమీపంలో భవానీ మాత ఆలయం ఉందని, దాని సమీపం నుంచి లైన్ వేస్తున్నారని తెలిపారు. పోమాల్‌పల్లి ప్రజలకు, దేవాలయానికి నష్టం జరుగకుండా లైన్ మార్చాలని వినతిపత్రంలో కోరారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు

షాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎంతటి వారైనా కేసులు నమోదు చేస్తామని షాబాద్ తహసీల్దార్ అన్వర్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సులభంగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడిన కొందరు ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటూ డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. మండల పరిధిలోని సోలిపేట గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 350లో ఉన్న 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం మేరకు సోమవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. సుమారు మూడు, నాలుగు చోట్ల 10 టిప్పర్లు, జేసీబీతో మట్టిని తీస్తుండగా.. అదుపులోకి తీసుకొని వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు. ఈసీ వాగు నుంచి ఇసుకను సైతం అక్రమంగా తరలిస్తున్న వారిపై దృష్టి సారించామని, త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మొరం తవ్వితే చర్యలు

బషీరాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని బషీరాబాద్ ఆర్ఐ శివచరణ్ హెచ్చరించారు. నీళ్లపల్లి శివారులోని గుట్ట వద్ద రోడ్డు మొరం తవ్వుతున్నారని సమాచారం అందింది. తహసీల్దార్ ఆదేశంతో ఆర్ఐ, రికార్డు అసిస్టెంటు మున్నప్ప తవ్వకాల వద్దకు చేరుకున్నారు. ఆర్ఐ ఇది అసైన్డ్ భూమి అని, ఇక్కడ మొరం తవ్వితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్స్‌కవేటర్లను అక్కడి నుంచి తరలించారు. దీనికి సంబంధించి తహసీల్దార్‌కు నివేదిస్తానని ఆర్ఐ చెప్పారు.

'డబుల్' ఇళ్ల పోరాటంలో న్యాయమే గెలిచింది

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్



మహేశ్వరం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మత ప్రాతిపదికన స్థానికేతరులకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలతో కలిసి చేసిన ఏడాది పోరాటానికి ఫలితం దక్కిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్ అన్నారు. ఇళ్లను పాత బస్తీ వాసులకు ఇవ్వాలనుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తుక్కుగూడ మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులు కోర్టును గతంలో ఆశ్రయించారని, ఏడాది తరువాత స్థానిక పేదలకు అనుకూలంగా మంగళవారం హైకోర్టు వెలువరించిన తీర్పు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదన్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ఒక్క తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధికే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయానికి కూడా వర్తిస్తుందన్నారు.

కంకర టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

పెద్దేముల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లారీలు అధిక లోడ్‌తో కంకరను తరలిస్తూ రోడ్డుపై కంకరపడి మంబాపూర్‌లో మంగళవారం విశాల్ అనే ద్విచక్ర వాహనదారుడు కిందపడిపోయి గాయపడ్డాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు కంకర లారీలను అడ్డుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీసులు టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. రేగొండి సమీపంలో టిప్పర్ల కారణంగా రోడ్డుపై భారీగా కంకర పడిపోతోంది. దీంతో బైక్‌లపై వెళ్తున్నవారు తరచూ పడిపోతున్నారు. అక్కడికి వచ్చిన సీఐ నగేష్ గ్రామస్తులతో మాట్లాడారు. అధికలోడ్ వాహనాలను నిరోధించాలని ఆయనను కోరగా రెండు టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు.

కేటీఆర్‌ను కలిసిన శుభప్రద్




వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ మంగళవారం హైదరాబాద్‌లోని మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతంపై కేటీఆర్ మార్గనిర్దేశం చేశారని శుభప్రద్ తెలిపారు.













తడి, పొడి చెత్తను వేరు చేయాలి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్

వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు తడి, పొడి చెత్తలను వేరుచేసి మునిసిపల్ కార్మికులకు అప్పగించాలని మునిసిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం 100రోజుల ప్రణాళికలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపార సముదాయాల వారికి పన్ను చెల్లింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. నాలాల్లో పూడిక తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మోహన్‌నాయక్

బ్రిడ్జి పనులు పరిశీలించిన చీఫ్ ఇంజినీర్

వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొండాస్‌పేట-వికారాబాద్ వరకు రూ.170కోట్లతో చేపట్టిన రోడ్డు పనుల్లో గోధుమగూడ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా సాగుతున్నాయి. మగళవారం చీఫ్ ఇంజినీర్ మోహన్ నాయక్ పనులను పరిశీలించారు. నిర్మాణ నాణ్యతపై దృష్టి సారించాలని కాంట్రాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డికి సూచించారు. త్వరలోనే ఈ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు.



ఐక్యత చాటుతున్న గొర్ల పెంపకందారులు

పశుసంవర్ధక శాఖ మంత్రిని నియమించాలి

మూడుచింతలపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పశుసంవర్ధకశాఖ మంత్రిని నియమించాలని గొర్లు, మేకల పెంపకందారుల రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, కేశవరంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం నిర్వహించిన పెంపకదారుల మూడో జిల్లా మహాసభకు ఆయన హాజరయ్యారు. గొల్ల కురుమలకు రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఇప్పుడు దానిపై మాట్లడటం లేదన్నారు. రాష్ట్రంలో గొర్లు, మేకల, ఇతర పశుసంపద లక్షల్లో ఉన్నా ఆ శాఖకు మంత్రి లేడని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి కొమురయ్య, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

కొడంగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎస్సై జీవీ.సత్యనారాయణ అన్నారు. మంగళవారం కొడంగల్‌లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, ధరలు తదితర వాటిని పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గోవధకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తాండూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఖాంజాపూర్ శివారులోని బీరప్ప గుడి, వేంకటేశ్వరస్వామి ఆలయాల సమీంలో ఆవు తలను ఉంచిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గోవధకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలన్నారు. సోమవారం రాత్రి ఆలయ సమీపంలో దుండగులు ఆవు తలను పడేయగా గుర్తించిన బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. గోవధ నిషేధ చట్టం అమల్లో ఉన్నా ఆవులను చంపుతున్నారని వాపోయారు. ఇదే విషయమై మంగళవారం కరన్‌కోట్ స్టేషన్‌లో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్‌లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు ఆంజనేయులు, నాగారం మల్లేశం, బంటారం భద్రేశ్వర్, రజనీకాంత్, శివకుమార్, మఠం రవి, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ రమ్మీ

» అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడి, అప్పులు ఎక్కువ కావడంతో జీవతంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన బండి రామమైసూర్‌రెడ్డి(43) వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవాడు. అతను కొన్నాళ్లుగా ఆన్‌లైన్ రమ్మీగేమ్‌కు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధ పడేవాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సోమవారం శంకర్‌పల్లిలోని విష్ణులాడ్జికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్న పూట లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మల్లిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కస్తూర్బాలో కొత్త రుచులు



(ఐదో పేజీ తరువాయి)

విద్యాశాఖ అధికారులు కొత్త మెనూ అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త ఆహార పట్టికను సమర్థంగా అమలు చేయడానికి కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కొత్త వంటకాల తయారీపై తొలుత హైదరాబాద్‌లో 8వ తేదీన కొందరికి శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారితో జిల్లాలోని మిగతా వారందరికీ ప్రాంతాల వారీగా వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి.

మారిన మెనూ..

ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు స్కూళ్ల ప్రారంభ తేదీ నుంచే పర్యవేక్షించాలని జిల్లా ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. మారిన మెనూ స్కూళ్ల ప్రారంభం రోజైన గురువారం నుంచే అమల్లోకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రతి రోజూ మారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఉదయం అల్పాహారం కింద సోమవారం ఉప్మా పెడితే మరుసటి రోజు ఇతర వంటకాల్లో ఏదైనా ఒకదాన్ని వడ్డిస్తారు. ఇలా రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వివిధ రకాల రుచులతో వంటకాలు అందిస్తారు. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డులో పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అలాగే బాలికల తల్లితండ్రులకు కూడా దీనిపై అవగాహన కల్పించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 39 స్కూళ్లు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 39 కస్తూర్బా బాలిక విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 20 కేజీబీవీలు, వికారాబాద్‌లో 19 కేజీబీలు ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత మేడ్చల్‌లో కొత్త కేజీబీవీలు ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని కేజీబీవీల్లో దాదాపు ఆరు వేల మంది బాలికలు చదువుతున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

» మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి, ఎమ్మెల్యే యాదయ్య, తదితరులు

చేవెళ్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ వంద రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపాల్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే వార్డు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తీసుకునే ఆహరం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాలతో ప్రతి ఒక్కరూ అనారోగ్యం భారిన పడుతున్నారని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపాల్ ప్రత్యేకాధికారి శ్రీధర్, చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ పూర్ణచందర్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మున్సిపాల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, నాయకులు గంగి యాదయ్య, షాబాద్ దర్శన్, పైండ్ల మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

హాస్టల్ పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలి

వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. మంగళవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన ఎనిమిది మంది అధికారులకు శిక్షణలో భాగంగా హాస్టల్ నిర్వాహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. శిక్షణలో డీటీడీవో కమలాకర్‌రెడ్డి, డీబీసీడీఓ ఉపేందర్, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో వెంకటరవణ, డీటీవో జర్సన్ కుమార్, శుక్రవారంరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారలుఉ పాల్గొన్నారు.

మూడు నెలల బియ్యం పొందాలి

తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు నెలల సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తోందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కార్డుదారులు జూన్ 30లోపు రేషన్ షాపుల్లో బియ్యం పొందాలని సూచించారు.

కరన్‌కోట్ సీసీఐలో ఉత్పతి ప్రారంభం

తాండూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్‌లో గల భారత ప్రభుత్వ రంగ సిమెంటు కర్మాగారంలో మంగళవారం ఉత్పత్తి మళ్లీ ప్రారంభమైంది. ఫ్యాక్టరీ యాజమాన్యం ఐదు రోజులుగా కోల్‌మిల్లులో బొగ్గు బర్నింగ్ ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించింది. ఐదు రోజుల క్రితం కర్మాగార కోల్ మిల్లులో సాంకేతిక లోపంతో బాల్ పగిలిపోయింది. కర్మాగారంలో రోజూ 2,600 టన్నుల సిమెంటు ఉత్పత్తి అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్ తప్పనిసరిగా పాటించాలి

చేవెళ్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 169 కేసులు పరిష్కరించి రూ.3,78,000 జరిమానా విధించినట్లు చెప్పారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీని సస్పెండ్ చేయాలి



తాండూరులో ధర్నా చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

తాండూరు/పరిగి/దుద్యాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బెల్కటూర్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితులను అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్), ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఎస్పీని విధుల నుంచి సస్పెండ్ చేయాలని నాయకులు అన్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సొంతూరు బెల్కటూర్‌లో ఓ దళిత కుటుంబం పెళ్లి వేడుక నిర్వహించుకొని ఆలయంలోకి వెళ్దామంటే కొందరు అగ్ర కులస్థులు వారిని అడ్డుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య, వివిధ సంఘాల నాయకులు చంద్రయ్య, బుగ్గప్ప అన్నారు. మంగళవారం నిరసన చేపట్టారు. ఈ కేసును నీరుగార్చే యత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్న తాండూరు డీఎస్పీని సస్పెండ్ చేయాలని పరిగి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. దళితుడి పెళ్లి ఊరేగింపును అడ్డుకుని బెదిరించడం ఏమిటన ప్రశ్నించారు. కేసు పెట్టినా డీఎస్పీ పెత్తందార్లకు వత్తాసు పలుకుతున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, శేఖర్, రాంచంద్రి, ప్రశాంత్, వెంకటయ్య, ఆసిఫ్ పాల్గొన్నారు. బెల్కటూర్‌లో దళితులపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నవీన్‌కుమార్, బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. దుద్యాలలో వారు మాట్లాడారు. తాండూర్ డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకుల అరెస్టు సరికాదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, రాములు, సాయికుమార్, బుగ్గప్ప, అంబేద్కర్ సంఘాల నాయకులు ఆనంద్, మహేశ్ పాల్గొన్నారు.

సాగులో అధికారుల సూచనలు పాటించాలి



సస్యరక్షణ చర్యల గురించి వివరిస్తున్న ఏడీఏ శంకర్‌రాథోడ్

కొడంగల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలని కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. మంగళవారం పర్సాపూర్ రైతు వేదికలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో కృషివాస్ అనే యాప్‌పై అవగాహన కల్పించారు. చీడ పీడలను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రామన్‌గౌడ్, జగదీశ్, తులసి, నాగరాజు, పోలప్ప పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

బొక్కల ఫ్యాక్టరీని మూసివేయాలని ఆందోళన

ధారూరు, జూన్10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దోర్నాల గ్రామ శివారులో ఉన్న బొక్కల ఫ్యాక్టరీని మూసివేయాలని గ్రామస్తులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఆందోళన కొనసాగించారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని, పశువుల ఎముకలతో నూనె తయారుచేస్తున్నారని ఈ వాసనకు చుట్టు పక్కల పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. ఫ్యాక్టరీని మూసివేయాలని డిమాండు చేస్తూ వారు రోడ్డు పై బైఠాయించారు. పశువుల ఎముకల లోడుతో ఉన్న వాహనాలను దిగ్బంధించి టైర్లలో గాలి తీసేసి వాటిని నిలిపివేశారు. ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదా బేగం గ్రామానికి వెళ్లి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఫ్యాక్టరీలో తనిఖీలు చేయించి నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని వివరించారు.



ధర్నా నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తలకొండపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీల కార్మికులు తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జి.పెంటయ్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న నాలుగుల నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, డ్రెస్సులు,సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఎంపీడీవో శ్రీకాంత్ కు అందజేశారు. మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి రాములు, కోశాధికారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రసవం.. విచారణకు ఆదేశించిన డీఎంహెచ్‌వో

వికారాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'రోడ్డుపై యాచకురాలు ప్రసవం' అనే వార్తపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. వెంకటరవణ స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవిత్రను ఆదేశించారు. విచారణలో రాళ్ల చిట్టంపల్లికి చెందిన హరిజన్ మౌనిక అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవం జరిగిందని, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. మౌనిక రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స అందించామని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



కందుకూరు మండలం లేమూరులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహేశ్వరం/కందుకూరు/కేశంపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లేమూరు మాజీ ఎంపీటీసీ యాదయ్య అన్నారు. మంగళవారం కందుకూరు మండలం లేమూరులో అవేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని 142 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు అవేర్ కార్యనిర్వాహక అధికారి వెంకన్న, వైద్యులు ప్రభాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే కేశంపేట మండలం లేమామిడిలో పోతరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, గోగు దేవకమ్మ, గోగు వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైంది. దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికే పోరాటం

» ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ మాదిగ

ఆమనగల్లు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేసిందని, దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల కోసం ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో పెద్దఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించి దండోరా జెండాను ఆవిష్కరించాలన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి రఘువరన్ మాదిగలతో కలిసి ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నూతన కమిటీలను పునర్నిర్మాణం చేస్తూ ఉద్యమాన్ని శాస్త్రీయంగా, నిర్మాణాత్మకంగా, సైద్ధాంతికంగా బలంగా తయారు చేయాలని కోరారు. పోతుగంటి కృష్ణ, రామచంద్ర, తుడుం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాధ్యక్షులు శ్రీశైలం, రమేశ్, మార్కండేయ శ్రీరామ్, మంద రాకేశ్, పర్వతాలు, కాలె శ్యామ్‌సుందర్, కాలె శివకుమార్ పాల్గొన్నారు.

ఆశల మొలకలు!



అంతారం తండా శివారులో మొలకెత్తిన కంది

తొలకరి వర్షాలు కురియడంతో రైతులు విత్తనాలు విత్తుకుంటున్నారు. మొదట విత్తిన విత్తనాలు మొలకెత్తాయి. తొలకరి వర్షాలతో మండల పరిధి గ్రామాల్లో 6,485ఎకరాల్లో పత్తి, 17,500ఎకరాల్లో కంది, 1,950 ఎకరాల్లో పెసర, 1,400 ఎకరాల్లో మినుము, మొక్కజొన్న వెయ్యి ఎకరాల్లో వేశారు. చెంగోల్, ఐనెల్లి, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, అంతారం, కరన్‌కోట్, మల్కాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో ఎర్ర, నల్ల రేగడి నేలల్లో కంది, పెసర, మినుము, పత్తి పంటలు వేశారు. ఉద్దండాపూర్, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డ తండా, జినుగుర్తి, జినుగుర్తితండా, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, బెల్కటూర్, గోనూరు, వీర్‌శెట్టిపల్లి, బిజ్వార్, బొంకూరు, చెంగోల్, చింతామణిపట్నం, పర్వతాపూర్ గ్రామాల్లో విత్తనాలు వేశారు. 15రోజుల క్రితం వేసిన విత్తనాలు మొలకెత్తయి. బషీరాబాద్ మండలం గొట్టిగఖుర్దులో పత్తి పంట మొలకెత్తుతోంది. పలు గ్రామాల్లో విత్తే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ సారి మండలంలో అన్ని రకాల పంటలు కలిపి 20వేల ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.



బషీరాబాద్ మండలం గొట్టిగఖుర్దు శివారులో పత్తి మొలకలు

- తాండూరు రూరల్/బషీరాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి)

సమస్యల స్వాగతం

(ఐదోపేజీ తరువాయి)

గ్రామాల్లో అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి. పరిగిలోని మల్లెనిమోనిగూడ పాఠశాలతో పాటు గడ్డమీది ప్రాథమికోన్నత బాలుర పాఠశాలలో ఒక భవనం శిథిలావస్థకు చేరుకుంది. లక్మీదేవిపల్లి గ్రామంలో కూడా అధనపు తరగతుల గది నిర్మాణం ఏళ్ల తరబడి ఆగిపోయింది. దోమ మండలం, ఐనాపూర్ గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పూడూరు మండలం, కంకల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

శిథిలావస్థలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు

చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినా వాటిని వినియోగించుకునేందుకు ముఖ్యమైన నీటి వసతి లేకపోవడం గమనార్హం. ఇప్పటికీ పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. బాలలు, బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు ఉండాలని ప్రభుత్వం గతేడాది అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద అన్ని పాఠశాలల్లో నీటి వసతి, మరుగుదొడ్లను నిర్మించినా ప్రయోజనం కనిపించడం లేదు. పాఠశాలల్లోని విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తాగడానికి సైతం నీరు లేక ఇంటికి వెళ్లి నీరు తాగాల్సిన పరిస్థితి.

పొంచి ఉన్న ప్రమాదం...

వికారాబాద్ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ఎప్పుడు పైకప్పు ఊడిపడుతుందో తెలియని స్థితిల్లో ఉన్నాయి. వికారాబాద్ మండల, మునిసిపల్ పరిధిలో కలెక్టర్ చొరవతో పాఠశాలల్లో మరమ్మతులు పనులు చేపట్టారు. వికారాబాద్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఎప్పుడు కూలి పడతాయో అనిపించిన ఈ భవనంపై కలెక్టర్ ప్రత్యేక నిధులతో స్లాబ్‌పై మళ్లీ స్లాబ్ వేసే పనులు చేపట్టారు. అదే విధంగా మునిసిపల్ మండల పరిధిలో 15 పాఠశాలలు మినహా అన్ని పాఠశాలలకు రంగులు వేస్తున్నారు. అయితే చాలా చోట్ల పైపై మెరుగులు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. రాళ్లచిట్టంపల్లి గ్రామంలో సైతం రంగులు వేసినా పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధారూరు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితిలో కనిపిస్తున్నాయి. మున్నూరుసోమారం పాఠశాలలో ఏప్రిల్‌లో తరగతి గది పైకప్పు పెచ్చులూడి ఓ విద్యార్థిని గాయపడింది. కుక్కింద ప్రాథమిక పాఠశాలలో ఐదు, నాగసమందర్‌లో రెండు, అవుసుపల్లిలో ఒకటి, మోమిన్‌కలాన్ జడ్పీహెచ్ఎస్‌లో రెండు, తరిగోపుల, మైలారం పాఠశాలలో ఒక్కో తరగతి గది శిథిలావస్థలో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో తరగతి గదుల్లో కూర్చుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని టీచర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆందోళన తప్పేలా కనిపించడం లేదు. నవాబుపేట మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది.



యాలాల: సంగెంఖుర్దులో శిథిలావస్థకు చేరిన ప్రైమరీ పాఠశాల

ప్రమాదం జరిగినా.. మరమ్మతులేవి?

గత ఏప్రిల్‌లో ధారూరు మండలం, మున్నూరు సోమారం పాఠశాల తరగతి గది పైకప్పు కూలి ఒకటో తరగతి విద్యార్థిని గాయపడి ఆసుపత్రి పాలైంది. పైకప్పు కూలిన రోజు హడావిడి చేసిన విద్యాశాఖ అధికారులు కూలిన తరగతి గదిని మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మోమిన్‌పేట్ జెడ్పీ పాఠశాల ఆవరణ చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో నిండింది. చేతులు కడుక్కునేందుకు కుళాయి కనెక్షన్లు లేవు. వాటర్ ట్యాంకు వృథాగా మారింది. గోవిందాపూర్ గ్రామ పాఠశాల ఆవరణలో బీరు సీసాలు దర్శనమిచ్చాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలావస్థలో ఉన్నాయి. గత ప్రభుత్వం మన ఊరు, మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు అసంపూర్తిగా మారడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలకు పరిష్కారం ఎప్పుడో?!

కొడంగల్ మునిసిపల్ పరిధిలోని ఐనన్‌పల్లి ప్రాథమిక పాఠశాల పురాతన భవనం శిథిలావస్థకు చేరింది. ప్యాలమద్ది ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ప్రహరీ లేక సాయంత్రంపూట మందుబాబులకు అడ్డాగా మారింది. బొంరాస్‌పేట్ మండలంలోని 51 పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉండగా కొన్నింటికి నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. మెట్లకుంట పాఠశాలపై ఏడాది కిందట కొత్తగా స్లాబ్ వేశారు. ఈ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్లాస్టరింగ్ చేయకపోవడంతో పెచ్చులూడినట్లు కనిపిస్తోంది. హెచ్ఎం గదికి తలుపులు, కిటికీలు లేకపోవడంతో చెత్తకుప్పలా మారింది. దౌల్తాబాద్ మండలంలో కుప్పగిరి దాసరిదొడ్డి పాఠశాల శిథిలావస్థకు చేరింది. దుద్యాల మండలంలోనూ పలు పాఠశాలలకు ప్రహరీలు లేక సాయంత్రం వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారాయి.



పెచ్చులూడుతున్న పెద్దేముల్‌లోని ప్రాథమిక పాఠశాల

కీసరలో పాఠశాలలో విరిగిపోయిన మరుగుదొడ్డి డోరు





కీసర జడ్పీహెచ్ఎస్‌లోని వాటర్ ఫిల్టర్‌లో పేరుకుపోయిన చెత్త



పరిగి మునిసిపల్ పరిధిలో శిథిలావస్థకు చేరిన మల్లెమోనిగూడ పాఠశాల భవనం



బొంరాస్‌పేట్: చెత్త కుప్పలా మారిన మెట్లకుంట పాఠశాల హెచ్ఎం గది

తలసాని శంకర్‌యాదవ్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీ‌ష్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్

శామిర్‌పేట, జూన్10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి తలసాని శంకర్‌యాదవ్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి హరీ‌ష్‌రావు అన్నారు. మంగళవారం తుర్కపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ ప్రథమ వర్ధంతికి ఆయన విచ్చేశారు. శంకర్‌యాదవ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తలసాని కుటుంబీకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

కీసర/మర్పల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ పరిధి కీసరలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథి వజ్రేష్ మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామన్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా శంకుస్థాపన చేసిన ఇంటి నిర్మాణ పనులు పూర్తిఅయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకులు రామిడి విజయ్‌రెడ్డి, ముపు రామారావు, పన్నాల బుచ్చిరెడ్డి, చర్లపల్లి కృష్ణారెడ్డి, స్వప్నరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహనకృష్ణ అన్నారు. మంగళవారం మర్పల్లి మండలం గుండ్లమర్పల్లికి చెందిన జయమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను మండల అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



కీసరలో ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న వజ్రేష్ యాదవ్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కులకచర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మంగళవారం కులకచర్లలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఓవర్‌స్పీడ్, హెల్మెట్‌లేకుండా నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం తాగి నడిపితే చర్యలతో జరిమానాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యదర్శిగా మాయ నరేష్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల కార్యదర్శిగా మాయ నరేష్ నియమితులయ్యారు. ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ నియామకపత్రం అందజేశారు. మర్రిపల్లిగూడకు చెందిన నరేష్ క్రియాశీలకంగా పనిచేయడంతో నాయకులు మండల కార్యదర్శిగా నియమించారు.

ఉచితంగా వేద విద్య

శామీర్‌పేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి తూంకుంటలోని శ్రీ రామభద్ర వేద పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలు తీసుకుంటున్నట్లు పాఠశాల నిర్వాహకుడు పండరిసంతోష్‌కుమార్‌శర్మ మంగళవారం తెలిపారు. గురుకుల వేదభవన్ అధ్యయనం చేసి అనుభవం ఉన్న అధ్యపకులచే ఉదయం పూట సాధారణ తరగతులు సాయంత్రం వేదాలను బోధించనున్నట్లు తెలిపారు. ఈ వేద పాఠశాలలో విద్యార్థులకు యజుర్వేదం, సంస్కృతాన్ని ఉచితంగా బోధించనున్నట్లు వెల్లడించారు. 12 సంవత్సరాలలోపు బాలురను మాత్రమే పాఠశాలలో చేర్చుకుంటున్న ఆయన స్పష్టం చేశారు. ఆసక్తిగల వారు పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించాలని ఆయన సూచించారు. అదనపు సమాచారం కోసం ఫోన్ నంబర్ 9985559791లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



దుద్యాల: జీడిగడ్డ తండాలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్/దోమ/బొంరాస్‌పేట్/మోమిన్‌పేట్/కీసర/కొడంగల్ రూరల్/శామీర్‌పేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులన్నారు. బడిబాటలో భాగంగా మంగళవారం కొడంగల్‌లో ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వెంకట్ అన్నారు. మంగళవారం దోమ మండలం దిర్సంపల్లి గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం యూత్ సభ్యులు, హెచ్ఎం కేశవులు, గోపాల్, సతీశ్, యూత్ సభ్యులు ఇమ్రాన్, సోను, సొహైల్, ఆరిఫ్, తాహెర్, హుస్సేన్, మొయిజ్, కాజీమ్ పాల్గొన్నారు. దోమ మండలం మోత్కూర్, రాకొండ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. శ్రీధర్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, మల్లప్ప, సుధాకర్‌రావు, ముకుందారెడ్డి, మాధవి అన్నారు. జీడిగడ్డ తండాలో బడిబాట నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండలం మహంతీపూర్‌లో బడిబాట కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు మల్లయ్య, అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, స్రవంతి, నామ్య పాల్గొన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధిస్తారని మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో బడిబాట నిర్వహించారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కూల్ డ్రెస్సులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, టీచర్లు రాందాస్, సురేశ్, సుధాకర్, పద్మారావు, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు. కీసర మండలం యాద్గార్‌పల్లి ర్యాలీలో ఇన్‌చార్జి ఎంఈవో జమదగ్ని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. పిల్లలను పెద్ద సంఖ్యల్లో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. హెచ్ఎం పుష్పకళ, టీచర్లు సత్తిరెడ్డి, చీర యాదగిరి, సతీష్ కూమార్, కౌసల్య పాల్గొన్నారు. బడిబాటలో భాగంగా కొడంగల్ మున్సిపల్ పరిధి ఐనన్‌పల్లిలో హెచ్ఎం మౌనిక, టీచర్ శ్రీకావ్య ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. జెడ్పీ బాలికల పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలేష్ వినూత్నంగా పప్పెట్ షో నిర్వహించారు. బడీడు చిన్నారులందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు జైపాల్‌రెడ్డి అన్నారు. శామిర్‌పేట మండలం తూంకుంట పరిధి దేవరమంజాల్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందజేస్తున్న నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ సదుపాయాలపై వివరించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ వారి చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. లక్ష్మీనారాయణ, అశోక్, మీనాకుమారి, హెచ్ఎం బాలేష్, కల్యాని ప్రసాద్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్/దౌల్తాబాద్/బొంరాస్‌పేట్/నవాబుపేట/తాండూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మోమిన్‌పేట్ తహసీల్దార్ రవీందర్ అన్నారు. గోవిందాపూర్, రామ్‌నాథ్‌గూడుపల్లి గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ సురేశ్, ఆర్ఐ గోవర్ధన్, సరిత, జూనియర్ అసిస్టెంట్లు అలివేలు, మహేశ్, మౌనిక, సునీత, సర్వేయర్ శ్రీనివాస్, రాఘవేందర్, రాజు, రాందాస్, నర్సింలు, పంచాయతీ కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి, ఏఎన్ఎం మంజుల, కారోబార్ మల్లేశం, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండలం సుల్తాన్‌పూర్, బాలంపేట్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ గాయత్రి దరఖాస్తులను స్వీకరించారు. టీడీ చాంద్‌పాషా, ఆర్ఐ సునిల్, పాల్గొన్నారు. బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 30దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఆర్ఐ శిరీష పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నవాబుపేట తహసీల్దార్ బుచ్చయ్య అన్నారు. మాదారం, గంగ్యాడలలో సదస్సులు నిర్వహించారు. మాదారంలో 25, గంగ్యాడలో 12దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. డీటీ శ్రీలత, ఆర్ఐ రాజు, రజిత, సిబ్బంది అలీ, ఆసిఫ్, నర్సిములు, సరోజ, మౌనిక, రాజు, ఫారూక్, పురుషోత్తం పాల్గొన్నారు. తాండూరు మండలం ఖాంజాపూర్, చింతామణిపట్నం, రాంపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో 13దరఖాస్తులు స్వీకరించామని డీటీ లలిత తెలిపారు. చింతామణిట్నంలో తహసీల్దార్ తారాసింగ్ దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ గోపి, ప్రదీప్‌కుమార్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మావతి

సంక్షిప్తంగా..

పరిగి: ప్రభుత్వ పాఠశాలలకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో గోపాల్ తెలిపారు. మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు మంగళవారం పుస్తకాలు అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ.. మండలంలో 5,673మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, వారికి 41,537నోటుపుస్తకాలు వచ్చాయన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు అందజేయాలని తెలిపారు.

దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించడం హర్షనీయమని సంఘం నాయకులు కూర వెంకటయ్య, నర్సప్ప, సత్యపాల్, కోట్ల హనుమంతు, వెంకట్రాములు, రాజు అన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి క్యాబినెట్‌లో స్థానం కల్పించడంతో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

మర్పల్లి: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. పట్లూర్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది, వైద్యులు హాజరు కాకపోవడంతో అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు. వైద్య సేవలు అందుతున్నాయా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు సిబ్బంది ఉండటంతో వైద్యులు ఎందుకు రాలేదని ప్రశ్నించగా తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. ఇక నుంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కులకచర్ల: పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. పీరంపల్లిలో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలుఉ వెంకటయ్యగౌడ్, గోపాల్‌నాయక్, జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌రెడ్డి, నర్సిములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: పౌర్ణమికి జరిగే కాగ్నా నది గంగా హారతి కార్యక్రమం నేడు (11న) తాండూరు సమీప కోకట్ కాగ్నా నదిలో సాయంత్రం 5:30గంటల నుంచి కొనసాగుతుందని ధర్మ జాగారణ సమితి ప్రతినిధులు వెల్లడించారు.

క్రైం కార్నర్

బండరాయి దొర్లి మీదపడి బాలిక మృతి



వైష్ణవి(ఫైల్)

పెద్దేముల్, జూన్10(ఆంధ్రజ్యోతి):మేకలు మేపేందుకు వెళ్లిన ముగ్గురు బాలికలు ఓ పొలంలో రాతిగుండుపై ఆడుకుంటుండగా ఒక్కసారిగా గుండు జారి ఒక అమ్మాయిపై పడడంతో ఆమె మృతిచెందిన సంఘటన ఉషానాయక్‌తండాలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాధిక, ప్రియాంక, వైష్ణవి అనే ముగ్గురమ్మాయిలు గిర్మాపూర్ శివారులో మేకలు మేపుతూ బండరాయిపై ఆడుకుంటున్నారు. ఉన్నట్టుండి బండరాయి కదిలి బాలికలు కిందపడిపోయారు. వైష్ణవి(11)పై నుంచి బండరాయి దొర్లుకుంటూ వెళ్లి గుంతలో పడింది. బాలికపై గుండు పడడంతో స్థానికులు వెంటనే సమీపంలో ఉన్న ఎక్స్‌కవేటర్ తెచ్చి గుండును తప్పించారు. వైష్ణవిని తాండూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందిందని వైద్యులు తెలిపారు. రాధిక స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

బొంరాస్‌పేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తి చెంది, ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డారు. సంఘటనల వివరాల్లోకి వెళ్తే... ఆర్థిక ఇబ్బందులతో దినసరి కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బొంరాస్‌పేట్‌కు చెందిన తోగాపూర్ రవి(36) తాపీ కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్థాపానికి గురైన రవి సోమవారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మంగళవారం రవి సోదరుడు శేఖర్ ఫిర్యాదు చేశాడని ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. కాగా రవికి ఇద్దరు కుమారుల్లో ఒకరు దివ్యాంగుడు, ఓ కూతురు ఉన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి...

వికారాబాద్: రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోధంగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల పక్కన మంగళవారం 35-40ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వ్యక్తి తెలుపు, నలుపు, బూడిద రంగుల చొక్కా, తెలుపు ప్యాంట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని వికారాబాద్ ఆస్పత్రిలో భద్రపర్చామని, వివరాలకు 7702629707నంబర్‌కు కాల్‌చేయాలని రైల్వే ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో

ఘట్‌కేసర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్ పట్టణం, బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన గుంట రమేష్(39) బోడుప్పల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమేష్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులవల్లే ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. రమేష్ సోదరుడి ఫిర్యాదు మేరమే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిప్పంటించుకొని ఒకరు..



ఆశప్ప(ఫైల్)

తాండూరు రూరల్: జీవితంపై విరక్తి చెంది నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చింతామణిపట్నంలో చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేకల ఆశప్ప (40) భార్య వెంకటమ్మతో కలిసి హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. ఆశప్ప మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది స్వగ్రామమైన చింతామణిపట్నంలోని తన ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆశప్ప భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృతి



కళేబరాలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి పద్మిని

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గొర్రెలమందపై కుక్కలు దాడి చేసిన 25గొర్రెలను చంపేశాయి. మర్రిపల్లిగూడకు చెందిన మేకల ఐలయ్య సోమవారం రాత్రి గొర్రెలను మందపెట్టి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయానికల్లా కుక్కలు 25గొర్రెలను కొరికి చంపేశాయి. జీవాలను చూసి ఐలయ్యా కన్నీరుమున్నీరయ్యాడు. తనకు రూ.2లక్షల నష్టం వచ్చిందని తెలిపాడు. పశువైద్యాధికారి పద్మిని అక్కడికి చేరుకొని గొర్రెలను పరిశీలించారు. గాయపడిన జీవాలకు వైద్యం చేశారు.

కెమికల్ ట్యాంకర్ దగ్ధం



మండుతున్న ట్యాంకర్‌ను క్రేన్‌తో తొలగిస్తున్న పోలీసులు

మూడుచింతలపల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కెమికల్ ట్యాంకర్ బోల్తాపడి దగ్ధమైన సంఘటన షామీర్‌పేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబాయిలోని ఓ అయిల్ సంస్థ నుంచి కెమికల్ లోడుతో ట్యాంకర్(ఎంహెచ్43 సీకె8786) హైదారాబాద్‌లోని శంభాపేట్‌కు సోమవారం రాత్రి బయలుదేరింది. మంగళవారం ఉదయం 11గంటల సమయంలో ట్యాంకర్ ఓఆర్ఆర్‌పై నుంచి సర్వీసురోడ్డుపై పడిపోయింది. ట్యాంకర్ యజమాని బిలాల్ అజాగ్రత్తగా క్రేన్‌తో ట్యాంకర్‌ను పక్కకు తొలగిస్తుండగా కెమికల్ లీకై మంటలు అంటుకున్నాయి. ట్యాంకర్ పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పారు. ట్యాంకర్ డ్రైవర్ ఫయాజ్ మద్యం తాగి ట్యాంకర్ నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, ప్రాణనష్టం ఏమి జరగలేదని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి.. యువకుడిపై పోక్సో కేసు

తాండూరు రూరల్,జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఓ గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 9న బాలికను ప్రకాశ్ అనే యువకుడు ఆటోలో ఎక్కించుకున్నాడు. చిట్టిఘనాపూర్ వద్దకు రాగానే బాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఎస్సై పేర్కొన్నారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రకాశ్‌పై ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు.

మా పొలాలకు దారి చూపండి

యాలాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలని రైతులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి పరిధిలోని సర్వే నంబర్158లో పలువురు రైతులకు 9ఎకరాల 21గుంటల భూమి ఉంది. ఈ భూముల్లోకి వెళ్లేందుకు తొవ్వలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.

'అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు'

తాండూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి):తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే టీఆర్ఎస్ నాయకులు నోరుజారుతున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లల్లో బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అభివృద్ధికి ఎలాంటి నిధులు తీసుకురాలేదన్నారు.